# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 07-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

- హెచ్ఐవి బాధితులకు సేవలందించడంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

- ప్రజల ఆరోగ్య భద్రతకు కూటమి పభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.

- అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసుల ఎదుట ఇద్దరు మావోయిస్టులు లొంగిపోయినట్లు ఎస్పి అమిత్ బర్దర్ చెప్పారు.

=================

రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ అన్నారు. అమెరికాలోని డల్లాస్‌లో ఈ రోజు నిర్వహించిన ప్రవాసాంధ్రుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అభివృద్ధిలో వేగానికి ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ అంబాసిడర్‌గా మారిందని, అభివృద్ధి పథంలో వేగంగా పయనిస్తోందన్నారు. ఒకే రాష్ట్రం - ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ తమ నినాదమని మంత్రి నారా లోకేశ్ ఈ సందర్భంగా పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

=================

హెచ్ఐవి బాధితులకు సేవలందించడంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో హెచ్ ఐ వి బాధితులకు నిత్యావసర వస్తువులను ఆయన ఈరోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 42 వేల మంది హెచ్ ఐ వి రోగులకు

ప్రభుత్వం పింఛన్ ఇస్తోందని, 2030 నాటికి ఆంధ్రప్రదేశ్ ను ఎయిడ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 105 రకాల వైద్య సేవలను అందిస్తుందని రామానాయుడు తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

=================

ప్రజల ఆరోగ్య భద్రతకు కూటమి పభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరం జిల్లా గంట్యాడలో 2 లక్షల 50 వేల రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్దిదారులకు మంత్రి ఈ రోజు అందించారు. పేదల ఆరోగ్య సంరక్షణకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చెప్పారు. ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతోందన్నారు.

=================

అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసుల ఎదుట ఇద్దరు మావోయిస్టులు లొంగిపోయినట్లు ఆ జిల్లా ఎస్పి అమిత్ బర్దర్ తెలిపారు. ఎస్పి కార్యాలయంలో ఆయన ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.... సిపిఐ (మావోయిస్టు) పార్టీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు దిరిదో విజ్జల్ అలియాస్ జైలాల్ అతని భార్య డివిజినల్ కమిటీ మెంబర్ మడివి గంగి అలియాస్ విమల లొంగిపోయారని చెప్పారు. గత నాలుగు దశాబ్దాల పాటు వీరు వివిధ హోదాలలో పని చేశారన్నారు. మావోయిస్టు పార్టీకి ప్రజల్లో ఆదరణ తగ్గడంతో వారు లొంగిపోయారని ఎస్పీ వెల్లడించారు.

=================

గంజాయి, డ్రగ్స్ పై ఉక్కు పాదం మోపేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళుతోందని (ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) ఈగల్ చీఫ్ రవి కృష్ణ తెలిపారు. గుంటూరు జిల్లా, నరసరావుపేట అడవి తక్కెళ్లపాడు టిడ్కో గృహ సముదాయం వద్ద ఈ రోజు నిర్వహించిన 'డ్రగ్స్ వద్దు బ్రో- సైకిల్ తొక్కు బ్రో' కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పి వకుల్ జిందాల్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ... గంజాయి, డ్రగ్స్ మత్తులో పడి యువత తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. మత్తు పదార్థాలతో కలిగే నష్టం గురించి యువత, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. గంజాయి వినియోగించినా, విక్రయించినా ఆ సమాచారాన్ని 1902కు ఫోన్ చేసి తెలపాలని ఆయన సూచించారు.

విరామం

=================

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పూర్వ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి బాటలు వేశారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీ వీ ఎన్ మాధవ్ వ్యాఖ్యానించారు. విజయవాడలో వాజ్‌పేయి శతజయంతి కార్యక్రమాల నిర్వహణపై ఆయన ఈ రోజు సమీక్ష చేసిన అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... వాజ్‌పేయి శతజయంతి సందర్భంగా ఆయన విగ్రహాలను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తామని, శతజయంతి కార్యక్రమాలను ఈనెల 11 నుండి 25 వరకు నిర్వహిస్తామని చెప్పారు. అందులో భాగంగా మొదటి రోజు వేడుకలకు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లను ఆహ్వానించామని వెల్లడించారు. అభివృద్ధిపరంగా రాష్ట్రాన్ని దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేస్తున్నాయని వివరించారు. ఫార్మా, ఐటీ రంగాలకు హబ్‌గా ఆంధ్రప్రదేశ్ మారబోతోందని, రాయలసీమను ఒక పవర్ హౌస్‌గా అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

=================

రాష్ట్రంలో అన్ని క్రీడలను ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్)కు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) సహకారం అందిస్తోందని ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ స్పష్టం చేశారు. విజయవాడలో యోనెక్స్ - సన్ రైజ్ 87వ సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ లోగో, పోస్టర్‌ను శాప్ చైర్మన్ రవినాయుడు, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్ లతో కలిసి కేశినేని శివనాథ్ ఈ రోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... యువతలో స్ఫూర్తిని నింపేందుకు ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో  క్రీడా పోటీల నిర్వహణ కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అన్నారు. ఏసీఏ తరఫున మంగళగిరి క్రికెట్ స్టేడియంతో పాటు, మరికొన్ని స్టేడియాల్లో అన్ని క్రీడలను ప్రోత్సహించే విధంగా కార్యవర్గాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. విజయవాడలో ఈనెల 22 నుంచి 28 వరకు యోనెక్స్ - సన్ రైజ్ 87వ సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ జరుగుతుందని శాప్ చైర్మన్ రవి నాయుడు తెలిపారు.

=================

విశాఖపట్టణంలోని సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారిని ఈ రోజు భారత క్రికెటర్లు విరాట్ కోహ్లీ, వాషింగ్టన్ సుందర్, ఫీల్డింగ్ కోచ్ దిలీప్ తదితరులు దర్శించుకున్నారు. దేవస్థానం ఉప కార్యనిర్వహణ అధికారిణి సింగం రాధ, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వర్ రావు వారికి స్వాగతం పలికారు. క్రికెటర్లు కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకొని బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. దర్శనానంతరం అర్చకులు వారికి వేదాశీర్వచనం చేశారు. స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అధికారులు వారికి అందజేశారు.

=================

రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో ఉండాలనే కృత నిశ్చయంతో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. విజయనగరంలో ఆయన ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... శాంతి భద్రతలను కాపాడటంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. లక్షల కోట్ల రూపాయల విలువైన పెట్టుబడులు ఆకర్షించి, పరిశ్రమల స్థాపనకు ప్రపంచ స్థాయి పారిశ్రామికవేత్తలతో ప్రభుత్వం విజయవంతంగా ఒప్పందాలు కుదుర్చుకొని ఉద్యోగ కల్పనకు కృషి చేస్తుందని పేర్కొన్నారు.

=================

ఆంధ్రప్రదేశ్ లోని దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈరోజు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ వెల్లడిస్తూ...

(వాయిస్ 19 సెకన్లు)

=================

పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి రోజూ ప్రజల నుంచి వినతుల స్వీకరణకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామని కలెక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వినతులను రేపు స్వీకరించడం జరుగుతుందన్నారు.

=================
=================